# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రానికి గత 23 నెలల్లో 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఇంధన పొదుపుపై ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ❖ అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- ❖ ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎ.పి.ఐసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి.
- ❖ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు.

==============================

రాష్ట్రానికి గత 23 నెలల్లో 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ఈరోజు నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో యువతకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. పిల్లలు సంపద అని గుర్తించాలని, తల్లికి వందనం కింద అందిస్తున్న 15 వేల రూపాయలను పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈరోజు నుంచే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభిస్తున్నామని, అన్ని ప్రాంతాల్లో నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని, ఇందులో భాగంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతిరోజు స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పేదరికం లేని సమాజం ఉండాలని, సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని తెలిపారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచి, ఆర్థిక అసమానతలు తగ్గించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

==============================

అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో 5 కోట్ల 56 లక్షల రూపాయలతో నిర్మించనున్న రహదారులు, వంతెనలు, కాలవలకు రక్షణ గోడల పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతులకు మూడు విడతలుగా 8,965 కోట్ల రూపాయలు అందజేస్తున్నామన్నారు. 2025-26 రబి సీజన్‌లో రాష్ట్రంలో 1,679 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.47 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించి.. లక్షా 67 వేల 257 మంది రైతుల ఖాతాలో 3,870 కోట్ల రూపాయలను జమ చేశామని చెప్పారు. ప్రస్తుతం ఇందన సంక్షోభ సమయంలో పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించి, వారానికి ఒకరోజు నో వెహికల్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

==============================

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంధన పొదుపుపై ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమరావతిలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయారుచేసుకుని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారని చెప్పారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా 6 లక్షల సౌరశక్తి కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2 కిలోవాట్ల విద్యుత్ ఉచితంగా పేదలకు ఇచ్చేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి.. ప్రజలపై భారం పడకుండా ఉండేలా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి తెలిపారు. గడిచిన 2 సంవత్సరాల నుంచి విద్యుత్ బిల్లులు పెంచకుండా ఎటువంటి ఖర్చులు ఉన్నా ప్రభుత్వమే భరించిందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి పెంచి.. ప్రజలపై భారం పడకుండా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

==============================

ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎ.పి. ఐసెట్ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 91.41 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మొత్తం 26,219 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 23,198 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 21,205 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కాకినాడ జిల్లాకు చెందిన వైష్ణవి 166 మార్కులతో ప్రథమ ర్యాంక్ సాధించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను cets.apsche.ap.gov.in ద్వారా పొందవచ్చునని మంత్రి లోకేశ్ సూచించారు.

విరామం

==============================

విజయనగరం జిల్లాలో జూన్ 15 నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) 3వ దశ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామ్‌సుందర్ రెడ్డి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 నుంచి 14వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారని, ఓటర్ల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. జూలై 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండే వారంతా తమ పేరు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలని కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్ రెడ్డి కోరారు.

==============================

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు పలు జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. “ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం” అనే ఇతి వృత్తంతో కాకినాడ నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ కుటుంబం ప్లాస్టిక్‌ను పూర్తిగా

నిషేధించడానికి సంకల్పించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను సంపూర్ణ ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అమలాపురం రైతు బజార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా విశాఖపట్టణాన్ని నిలుపుతామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ - ప్లాస్టిక్ రహిత విశాఖ" నినాదంతో రూపొందించిన అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వేంకటేశ్వర్ ప్రజలతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 21 నుండి జూన్ 4వ తేది వరకు సమర్ధవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఈరోజు ఆయన పరీక్షల నిర్వహణ కమిటీతో సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

==============================

పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆర్.ఏ.ఆర్.ఎస్.లో ఈ నెల 18వ తేదీ నుండి యంటియు రైస్ 1318 ఫౌండేషన్ విత్తనాలు విక్రయించనున్నట్టు పరిశోధనా స్థానం సహ-పరిశోధనా సంచాలకులు డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కిలో 42 రూపాయల ధరతో 25 కిలోల బస్తా విత్తనాలు 1,050 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు అవసరమయ్యే రైతులు ఉదయం 9 నుండి 11 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి నుండి 5 గంటల ఆర్.ఏ.ఆర్.ఎస్. కేంద్రం వద్ద కొనుగోలు చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు.

==============================

మే 26 ప్రాంతంలో కేరళంను తాకాల్సిన నైరుతి రుతుపవనాలు నాలుగు రోజుల ముందుగానో లేదా నాలుగు రోజుల ఆలస్యంగానో కేరళంలో ప్రవేశించే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం అంచనా వేస్తోంది. రాబోయే 3 నుంచి 4 రోజులలో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ దీవులు, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. మరిన్ని వాతావరణ విశేషాలు వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ అందిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================
==============================